# తాగునీరందక మూడు నెలలు

- డ్రెయినేజీ పనుల్లో పైపులు ధ్వంసం
- మరమ్మతులపై పట్టింపులేని అధికారులు
- ఆందోళనలో గ్రామస్తులు


అశ్వాపురంలో రహదారికి ఇరుపైపులా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు

**అశ్వాపురం:** మండల కేంద్రంలో అశ్వాపురం గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారికి ఇరుపైపులా సైడ్ డ్రెయినేజీ పనులు గత కొంత కాలంగా జరుగుతున్నాయి. డ్రెయినేజీ పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. కానీ డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో రహదారి వెంబడి పంచాయతీ ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైంది. దీంతో గత మూడు నెలలుగా గ్రామ పంచాయతీలో సుమారు 500 ఇళ్లకు తాగునీరు అందడం లేదు. తాగునీటి కోసం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

**వినతులు బుట్టదాఖలు..**

మిషన్‌భగీరథ పైపులైన్ పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టాలని స్థానిక సర్పంచ్ బాణోత్ శారద, గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు రెండు నెలలుగా విన్నవిస్తున్నప్పటికీ ఫలితం లేదు. ఇదిగో అదిగో అని నెలల తరబడి కాలం వెళ్లదీస్తున్నారు తప్ప పైపులైన్ మరమ్మతులు నేటి వరకూ చేపట్ట లేదు. వాస్తవానికి పైప్‌లైన్ పునరుద్ధరణకు డ్రెయినేజీ నిర్మాణ కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నట్లు స్వయంగా స్థానికులకు చెప్పాడు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారుల నుంచి అందించాల్సిందిగా కోరాడు. కానీ అధికారులు దీనిపై పట్టించుకున్నది లేదు. పనులు పూర్తయితే కాంట్రాక్టర్ వెళ్లిపోతాడు. అప్పుడు ఆ పైపులైన్ మరమ్మతుల సంగతేంటి? ఇప్పటికే స్పందించని ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు.. అప్పుడు మరమ్మతులు చేస్తారా?. ఇలా మిషన్‌భగీరథ పైపులైన్ మరమ్మతుల విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేస్తున్న నిర్లక్ష్యాన్ని సర్పంచ్ బాణోత్ శారద, స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై నిరసన**

మిషన్ భగీరథ పైపులైన్ పునరుద్ధరణ విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరును ఖండిస్తూ మండల కేంద్రంలో టీడీపీ సెంటర్‌లో సర్పంచ్ శారద ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. పైప్‌లైన్ పునరుద్ధరణలో అధికారుల నిర్లక్ష్యంపై నినాదాలు చేశారు. 500 కుటుంబాలకు తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నప్పటికీ పనుల అంచనాలు వేయడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడాన్ని విమర్శించారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే స్పందించి అంచనాలు వేయాలని కోరారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, వార్డు సభ్యులు చంద్రకళ, గాదె కేశవరెడ్డి, గ్రామస్తులు, పద్మ, ఓరుగంటి రమేష్, బాగం సతీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు**



డ్రెయినేజీ పనుల్లో మిషన్ భగీరథ పైపులు ధ్వంసం అయ్యాయి. పైపులైన్ మరమ్మతులకు ప్రతిపాదనలు ఇస్తే పునరుద్ధరించడానికి సిద్ధమని కాంట్రాక్టర్ 10 రోజుల క్రితం చెప్పారు. వారం రోజులు ఐతే డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తవుతాయి. కాంట్రాక్టర్ వెళ్లిపోతారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ప్రతిపాదనలు ఇవ్వమని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– బాణోత్ శారద, అశ్వాపురం సర్పంచ్

## క్లుప్తంగా

### అంతా నా ఇష్టం..!

**మణుగూరురూరల్:** మణుగూరు మండలంలో ఎలక్షన్ కోడ్ పేరిట మణుగూరు పోలీసుల చర్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు సూచించిన సూచనల కంటే ఇక్కడి పోలీసులు ఎక్కువగా హడావుడి చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా స్థానిక వ్యాపారులు పోలీసుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాత్రి తొందరగా దుకాణాలను మూసివేయాలని ఆదేశించడం, రాత్రి సమయాల్లో దూరప్రాంతాల నుంచి మణుగూరు వచ్చే వారిని పెట్రోలింగ్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం వంటివి అభ్యంతరకంగా మారాయి. ఈ మేరకు తమకు నచ్చినట్లు సొంత నిబంధనలు ప్రజలపై రుద్దుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే, రాత్రి సమయాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నా వాటిపైపు మాత్రం పోలీసులు కన్నెత్తి చూడడం లేదు. వాటిని నియంత్రించడంలో వైఫల్యం చెందుతున్నారు. బెల్టు షాపులకు వద్ద ఉపయోగపడని ఎలక్షన్ కోడ్ సాధారణ ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపడానికి పనికొస్తుందా అని మణుగూరువాసులు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. పోలీసులు చేస్తున్న ఎలక్షన్ కోడ్ అతి హడావుడిని ఉన్నతాధికారులు పరిశీలించి.. ఇతర ప్రాంతాల్లో ఉన్న స్వేచ్ఛనే తమకూ కల్పించాలని కోరుతున్నారు.

### అవగాహన సదస్సు


జూనియర్ కళాశాల వద్ద డీఐఈఓ సులోచనారాణి, తదితరులు

**ములకలపల్లి:** 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి (డీఐఈఓ) సులోచనారాణి సూచించారు. స్థానిక జూనియర్ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓటరు అవగాహనా సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, స్వీప్ కో–ఆర్డినేటర్ సుధాకర్, లెక్చరర్లు రాణి, కుమార్, రామకృష్ణ, సుచరిత, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ స్టేషన్ల పరిశీలన

**చంద్రుగొండ:** మండలంలోని పోకలగూడెం, తుంగారం, రావికంపాడులో పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ జి.రేవతి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.

### గుండాలలో భారీ వర్షం

**గుండాల:** గత రెండు మూడు రోజులుగా వాన మబ్బు చేస్తూ మంగళవారం గుండాలలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం సుమారు 30 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా వాన పడింది. దీంతో విరిసిన మొక్కజొన్న కంకులు తడిసిపోయాయి. ఇప్పుడే తీసేందుకు ఉన్న పత్తి సైతం ముద్దయిపోయింది. కళ్లాల్లో ఆరబోసిన పంట భారీ వర్షానికి తడిసిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**చంద్రుగొండలో చిరుజల్లులు..**

**చంద్రుగొండ:** మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి చిరుజల్లులు పడ్డాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొన్ని నెలలుగా వర్షం జాడలేదు. మరోవైపు ఎండలు తీవ్రత అధికంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో చిరుజల్లులతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

### విజయవంతం చేయండి

**ములకలపల్లి:** సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీన దమ్మపేటలో నిర్వహించనున్న సభకు భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, సర్పంచ్‌లు వాడే నాగరాజు, బైటి రాజేష్, సున్నం సుశీల, బీఆర్‌ఎస్ ములకలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రశాంత్

**చంద్రుగొండ:** యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా చంద్రుగొండకు చెందిన మక్కా ప్రశాంత్‌ను నియమిస్తూ నియోజకవర్గ అధ్యక్షుడు కొరంపల్లి చెన్నారావు లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు ప్రశాంత్‌ను లేఖ అందించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, చెవుల చందర్‌రావు, కేశబోయిన నర్సింహారావు, అన్వర్ యూత్ నాయకులు ఇమ్రాన్, వసీం, సంకా శంకర్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా నామినేషన్ల పర్వం

**పినపాకలో రెండు నామినేషన్లు**


నామినేషన్ వేస్తున్న ఈసం కృష్ణ

**మణుగూరురూరల్:** పినపాక నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తరపున ఈసం కృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా పూనం రంగయ్యలు తమ నామినేషన్ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై నాలుగు రోజులు కావస్తుండగా.. ఇప్పటికి ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.

**భద్రాచలంలో రెండు..**

**భద్రాచలం:** భద్రాచలం నియోజకవర్గంలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మర్మం తిరుపతమ్మ ఇండిపెండెంట్‌గా, ధర్మ సమాజ్ పార్టీ తరుపున రవ్వా భద్రమ్మలు రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా బుధవారం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య, గురువారం ప్రధాన పార్టీ అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయనున్నారు.

### జాతీయ స్థాయిలో ప్రతిభ

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారు. ఖమ్మంలో జరిగిన 27వ జాతీయ స్థాయి కరాటే పోటీలలో కళాశాలకు చెందిన సూర్యతేజ బ్లాక్ బెల్ట్ విభాగంలో, రాకేష్ బ్లూ బెల్ట్ విభాగంలో విజయం సాధించి బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ మంగళవారం విద్యార్థులను సత్కరించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### చైల్డ్‌కిట్లు పంపిణీ

**చంద్రుగొండ:** మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశాడే జరిగింది. పుట్టిన శిశువు సంరక్షణపై ఆశవర్కర్లకు డాక్టర్ కనకం తనుజ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి హోంబెస్ట్ కేర్ ఫర్ యంగ్ చైల్డ్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్‌ప్రకాష్, సిబ్బంది యండి.ఇమాం, చంద్రకళ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథమే ప్రగతికి మూలం

**భద్రాచలంటౌన్:** సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందితేనే మూఢవిశ్వాసాలు తగ్గి సమాజిక ప్రగతి పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నోబెల్ అవార్డు గ్రహీత సర్ సీవీ రామన్, మేరీ క్యూరీల జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో శాస్త్రవేత్తలు వారి ప్రాణాలను లెక్కచేయకుండా నిరంతరం చేస్తున్న కృషివల్ల ఉత్తమ పౌర సమాజం ఏర్పడుతుందన్నారు. దేశ భవిష్యత్తు కొరకు సీవీ రామన్ చేసిన సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్‌పై జరుగుతున్న దాడులను నిరశిస్తూ.. శాస్త్రీయ దృక్పథాన్ని వివరిస్తూ.. ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రజాసైన్స్ ఉద్యమం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, మేధావులు ముందుకొచ్చి భాగస్వాములు కావాలన్నారు.

# ప్రణాళికతో ఎన్నికలను ఎదుర్కొంటాం


చంద్రుగొండ: ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జారే ఆదినారాయణ


చంద్రుగొండ: బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

**చంద్రుగొండ:** పగడ్బంది ప్రణాళికతో ఎన్నికల బరిలోకి వెళ్తామని కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణ అన్నారు. చంద్రుగొండలో మంగళవారం రాత్రి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమన్వయ కమిటీతోపాటు బూత్ లెవల్ కమిటీలను సత్వరమే నియమిస్తామన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పట్టుదలతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలన ఎండగట్టాలని, కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరించాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, చెవుల చందర్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, గాదె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జారేకు టికెట్‌పై సంబురాలు**

**దమ్మపేట:** అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా, పొంగులేటి ప్రధాన అనుచరుడు జారే ఆదినారాయణ ఎంపికపై ఆనందం వ్యక్తం చేస్తూ.. పొంగులేటి వర్గీయులు సంబురాలు జరుపుకున్నారు. జారేకు కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కడంతో మంగళవారం మండల కేంద్రంలో పొంగులేటి అనుచరులు భారీగా బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో జారేతో కలసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అక్కడి నుండే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అలపాటి ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధకృష్ణ, కక్కిరాల రమేష్, రావు రవిశంకర్, పర్వతనేని ప్రసాద్, కెవి.సత్యనారాయణ, చామర్తి గోపీశాస్త్రి, సాయిల నర్సీ, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లి:** అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం జారే ఆదినారాయణ పేరును ఖరారు చేయడంతో పొంగులేటి వర్గీయులు మంగళవారం అన్నపురెడ్డిపల్లిలో సంబురాలు నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. అధిక మెజార్టీతో జారేను గెలిపించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ, పర్సా వెంకటేశ్వర్లు, బూరుగుపల్లి కృష్ణ, రమణ, లక్ష్మారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

**ములకలపల్లి:** కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట అభ్యర్థిగా జారే ఆదినారాయణను ప్రకటించడంపై మండల పార్టీశ్రేణులు సంబురాలు చేశారు. బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాలర్పించారు. ప్రధానకూడలిలో బాణాసంచా కాల్చారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ .. జారేను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, యువజన విభాగం నాయకులు కోరంపల్లి చెన్నారావు, జహీర్, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, మేకల రాజేష్, సొసైటీ మాజీ చైర్మన్ కరుటూరి కృష్ణ, మాజీ సర్పంచ్ పత్తిలాల్ తదితరులు పాల్గొన్నారు.

**చంద్రుగొండ:** హైకమాండ్ నిర్ణయించిన అభ్యర్థి జారే ఆదినారాయణ గెలుపు కోసం ఐక్యంగా కృషి చేస్తామని ఆ పార్టీ మండల నాయకులు స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశమైన నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, కేశబోయిన నర్సింహారావు మాట్లాడారు.అనంతరం ప్రధాన సెంటర్ బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు, దారం గోవిద్‌రెడ్డి, రామారావు, పుల్లయ్య, మదార్‌సాబ్, రుక్మిణి, రాముడు పాల్గొన్నారు.

# వృద్ధులు ఇంటి వద్దే ఓటేయొచ్చు..


వృద్ధులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి స్వర్ణలత లెనీనా

**అశ్వాపురం:** పోలింగ్ కేంద్రాలకు రాలేని వయో వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల నోడల్ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో మానవీయ వృద్ధాశ్రమంలో వృద్ధులతో, ఆశ్రమం నిర్వాహకులతో మంగళవారం స్వర్ణలత లెనినా ప్రత్యేక సమావేశమయ్యారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వయో వృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగం కోసం ఫారం–12 పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి, పంచాయతీ కార్యదర్శి వేణుప్రియ, ఆశ్రమం ప్రధాన కార్యదర్శి కమటం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న చేరికలు


చర్లరూరల్: గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తాతా మధు


అశ్వాపురం: పాయం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యాకూబ్‌పాషా తదితరులు

**చర్లరూరల్:** ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు, భద్రాచలం బీఆర్‌యస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో మంగళవారం చర్ల పట్టణానికి చెందిన సుమారు 100 కుటుంబాల వారు, కలివేరు, సత్యనారాయణపురం గ్రామాలకు చెందిన 250 కుటుంబాల వారు బీఆర్‌యస్ పార్టీలో చేరారు. బీఆర్‌యస్ పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు,కార్యదర్శి పోలిన లంకరాజు, మానె రామకృష్ణ, ఎంపీపీ కోదండ రామయ్య, సత్యనారాయణపురం పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరాజు, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, కొటేరు శ్రీనివాస రెడ్డి, తోటమళ్ళ వరప్రసాద్, పోలూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** పైడాకులమడుగు గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ మండల కమిటీ నాయకుడు కుంజా నాగయ్యతో పాటు 20 కుటుంబాలు భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్ సోడి జ్యోతి, నాయకులు ఎండి.జానీ పాషా, తునికి కామేష్, కొండపల్లి నరేంద్ర పాల్గొన్నారు.

**అశ్వాపురం:** మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ యువజన అధ్యక్షుడు యాకూబ్‌పాషాతో పాటు 15 కుటుంబాలు మంగళవారం రామచంద్రాపురం సర్పంచ్ కాక అశోక్ ఆధ్వర్యంలో తోగ్గూడెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పాయం కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బూరెడ్డి వెంకటరెడ్డి, చుంచు ఏకాంబరం పాల్గొన్నారు.

# ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

**బూర్గంపాడు:** ఈ నెల 13న లక్ష్మీపురంలో జరగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులకు సూచించారు. మంగళవారం సభాస్థలి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆయన స్థలాన్ని పరిశీలించారు. సభా స్థలం, పార్కింగ్ ఏరియాను చదును చేయాలని సూచించారు. భారీ జనసమీకరణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి రమణారెడ్డి, కామిరెడ్డి రామకొండారెడ్డి,కురుకుంట్ల చిన్నపరెడ్డి, బెజ్జంకి కనకాచారి, కోటమర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ..**

**అశ్వాపురం:** మండల పరిధిలోని ఆనందాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ తల్లి మంగమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. మంగమ్మ మృతదేహానికి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, బీఆర్‌ఎస్ నాయకులు సూదిరెడ్డి గోపాల కృష్ణారెడ్డి, మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, షేక్ నయీం, జూపల్లి కిరణ్, జిలాని, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జోరందుకున్న పార్టీల ప్రచారం

రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థినే గెలిపించాలని కోరుతూ ఆయా ప్రాంతాల్లో పలు పార్టీల నాయకులు చేస్తున్న ప్రచారం మంగళవారం జోరందుకుంది. పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో అటు పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుసుకుని పార్టీ మేనిఫెస్టోలను వివరించారు. వాటి అమలుకు తమ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. అధికార బీఆర్‌ఎస్ తమ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతుండగా.. కాంగ్రెస్ తమను గెలిపిస్తే అమలు చేయనున్న పథకాలు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్


కరకగూడెం: ఓటర్లకు మేనిఫెస్టోను అందజేస్తున్న విప్ రేగా కాంతారావు


అశ్వారావుపేటరూరల్: ప్రచారంలో పాడి గేదెను కడుగుతున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి


దుమ్ముగూడెం: ప్రచారంలో భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు


దుమ్ముగూడెం: తండ్రిని గెలిపించాల్సిందిగా కోరుతున్న పొదెం వీరయ్య కుమారుడు


చర్లరూరల్: ధర్మా గెలుపునకు మిర్చి తోటలో రైతుల వద్ద ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


చర్ల: వీరయ్యను గెలిపించాల్సిందిగా జెడ్పీటీసీ ఇర్పా శాంత, కాంగ్రెస్ నాయకుల ప్రచారం..


మణుగూరుటౌన్: పాయం గెలుపు కోరుతూ రామానుజవరంలో కాంగ్రెస్ నాయకులు


చర్ల: భద్రాచలం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య తరుపున ఓట్లు అభ్యర్థిస్తున్న బ్రహ్మచారి


మణుగూరురూరల్: ప్రభుత్వ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు


అశ్వారావుపేటరూరల్: ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు